గూడు కోసం గుంపుగా..

- కలెక్టరేట్లను ముట్టడించిన నిరుపేదలు
- ఇండ్లు, స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం, ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా.. నిరసన ప్రదర్శనలు
- పలు చోట్ల ఉద్రిక్తతలు.. అడ్డగింతలు.. వాగ్వివాదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గూడు కోసం నిరుపేదలంతా గుంపుగా కదిలారు.. ఎర్రజెండా నీడలో పేదలంతా కదం తొక్కారు.. అధికారులకు తమ మొర వినిపించేందుకు సిపిఎం, తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక అండగా.. కలిసికట్టుగా సోమవారం కలెక్టరేట్లకు తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్ల విషయంలో దశాబ్ద కాలంగా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టరేట్లను ముట్టడించారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట మహాధర్నా చేశారు. భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ క్రమంలో పలుచోట్ల పోలీసులకు నాయకులకు తోపులాట, వాగ్వాదం జరిగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో భారీ ప్రదర్శన, జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్‌కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజె రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ ప్రసంగించారు. కొత్తగూడెం, పాల్వంచలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం మొదలెట్టి ఎంతకాలం అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని సవరించి రూ.ఐదు లక్షలు, పిఎం ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలు ఇవ్వాలని అన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అడ్డంకులు

మహబూబాబాద్ జిల్లాలో పెద్దఎత్తున మహాధర్నా జరిగింది. ప్రజాసంఘాల పోరాట వేదిక ప్రతినిధి బృందం కలెక్టర్ శశాంక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. తెలంగాణ సాయుధ పోరాట వారసురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో కొనసాగుతున్న గుడిసెల పోరాటం ఆగదని ప్రజా సంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య అన్నారు. రాజ్యాంగబద్ధంగా భూమి లేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోవడం వారి హక్కు అని, కలెక్టర్, ఎమ్మెల్యే వారికి అండగా నిలబడి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాకు భారీఎత్తున పేదలు కదిలొచ్చారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు భారీగా మోహరించి కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం మూసేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు పాల్గొన్నారు. జనగామ జిల్లాలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోకుండా పోలీసులు ముండ్ల కంచె వేశారు. ఈ క్రమంలో ప్రజాసంఘాల నాయకులకు పోలీసులకు వాగ్వాదం జరిగింది.

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. కలెక్టరేట్ సమీకృత కార్యాలయం ఎదుట ధర్నాలో తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ 125 గజాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు మహబూబ్‌నగర్ జిల్లా మహాధర్నాలో మాట్లాడారు.

భారీగా తరలివచ్చిన మహిళలు

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. 'ఇంటి జాగాలు లేనిది.. గృహలక్ష్మి పథకం ఎక్కడ అమలు చేస్తారు. సిఎం కెసిఆర్ సార్.. ముందు ఇంటి జాగాలు ఇవ్వండి. మీరు ఇస్తారా లేక మేం ప్రభుత్వ జాగాల్లో గుడిసెలు వేసుకోవాలా..? కలెక్టరేట్‌లో ఉన్న ఖాళీ జాగాలో గుడిసెలు వేసుకుంటాం' అని మహిళలు నినాదాలు చేశారు. గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ మాట్లాడారు. వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి మాట్లాడారు.

ఉద్రిక్తంగా నిజామాబాద్ కలెక్టరేట్

నిజామాబాద్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా సాగింది. మొదట కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. ఆ తరువాత నాయకులు, ప్రజలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ఆందోళనకారులను పోలీసులు నిలువరించారు. ప్రధాన గేటుకు తాళం వేశారు. సిఐటియు జిల్లా నాయకుడు మల్యాల గోవర్ధన్ ఇనుప గేటు ఎక్కి లోపలికి దూకారు. మిగతా నాయకులు, ప్రజలు గేట్లు తోచుకుంటూ ముందుకు సాగారు. దీంతో తాళం విరిగి గేటు తెరుచుకుంది. 'పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి' 'ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లారు. కలెక్టరేట్ లోపల మరోసారి బారికేడ్లతో ఆందోళనకారులను పోలీసులు నిలువరించారు. 'ఎండలో మేము.. ఏసీల్లో మీరా?.. 'కలెక్టర్ బయటకు రావాలి.. ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి' అని నినాదాలు చేశారు. అయితే ప్రతినిధి బృందాన్ని కలెక్టర్‌తో కలిపిస్తామని పోలీసులు చెప్పగా.. కలెక్టర్ బయటకు వచ్చి మా బాధలు వినాల్సిందే అని పట్టుబట్టారు. దీంతో కలెక్టర్ పరిపాలన అధికారి ప్రశాంత్ ప్రజాసంఘాల నాయకుల వద్దకు వచ్చి నచ్చజెప్పేందుకు యత్నించారు. కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి సమస్యను వివరిస్తామని హామీఇచ్చారు. వీలైనంత త్వరగా సర్వేయర్‌ను పంపుతామని కలెక్టర్ హామీనిచ్చారు. అంతకుముందు ధర్నానుద్దేశించి తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్ మాట్లాడారు.

సూర్యాపేట కలెక్టర్ కారు అడ్డగింత..

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కోటి ఆశలతో ఏర్పడిన రాష్ట్రంలో పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన కలెక్టర్ వెంకట్రావు కారును ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు ప్రజాసంఘాల నాయకులకు మధ్య స్వల్ప వాగ్వావాదం జరిగింది. అనంతరం కలెక్టర్ వెంకట్రావుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కలెక్టరేట్ ఏవో శ్రీదేవికి అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున రెడ్డి, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు గృహల్మక్షి పథకం కింద రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్, మేడ్చల్‌లో భారీగా..

హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి నర్సింహారావు మాట్లాడుతూ.. నగరంలో ఇండ్లులేని పేదలు 10 లక్షలకుపైగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా అర్హులకే డబ్బుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు డిజి.నర్సింహారావు మాట్లాడారు.

మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ.. చెన్నూరులోని బావురావుపేట శివారు సర్వే నెంబర్ 8లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జాదారులు అక్రమ పట్టాలు చేసుకున్నారని, వాటిని రద్దు చేసి పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆవాస్ యోజన జాడేదీ..

ఇండ్ల స్థలాలివ్వాలని, గతంలో పట్టాలిచ్చిన చోట పొజిషన్ చూపాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వందలాది మంది పేదలు ధర్నా చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ పాల్గొని వారినుద్దేశించి మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎక్కడా పేదలకు ఇళ్లు కట్టించిందిలేదన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ పాల్గొన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట పేదలు పెద్దఎత్తున ధర్నా చేశారు.

యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ మాట్లాడారు. ఇండ్ల స్థలాలు లేని పేదలందరినీ గుర్తించి 125 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వ రూ.పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా దగ్గరకు వచ్చిన కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగలక్ష్మి, భువనగిరి ఆర్‌డిఒ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన కలెక్టర్ బొర్కాడే హేమంత్ దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ద.మ.రైల్వేకు బెదిరింపు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వేకు గుర్తు తెలియని వ్యక్తి బెదిరింపు లేఖ రాశాడు. తాజాగా ఇది వెలుగులోకి వచ్చింది. 'త్వరలో ఘోర రైలు ప్రమాదం జరుగుతుంది. మరో వారం రోజుల్లో ఒడిశా తరహా ప్రమాదం జరుగుతుంది. హైదరాబాద్ - ఢిల్లీ మార్గంలోనే ఘటన జరుగుతుంది" అని లేఖ ద్వారా హెచ్చరించాడు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి గత వారం ఈ హెచ్చరిక లేఖ అందినట్లు తెలుస్తోంది. అయితే ఈ లేఖపై రైల్వే అధికారులు స్పందించాల్సి ఉంది.

తాటి చెట్టు పైనుంచి పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడటంతో గీత కార్మికుడు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రామానికి చెందిన గీత కార్మికుడు కమ్మగోని స్వామి (58) తాటి చెట్టుపై కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. స్వామి మృతదేహాన్ని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సంఘం మండల అధ్యక్షులు పబ్బతి మల్లేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి గాజుల ఆంజనేయులు గౌడ్, కోశాధికారి పలుసం స్వామి గౌడ్, గ్రామ అధ్యక్షుడు కర్నాటి సైదులు గౌడ్, గంగాపురం నరసింహ, కాసుల సాయిలు, గంగాపురం కిష్టయ్య, గంగాపురం వెంకటేష్ గౌడ్ నివాళి అర్పించారు.

IN THE COURT OF THE 2 ADDITIONAL DISTRICT JUDGE:: KURNOOL AT ADONI
O.S.NO. 13/2021

BETWEEN:
S. Krishna Veni @ Geethal. ...Plaintiff
...Vs...
S.Rama Chandra Rao and others. ...Defendants

To:
D5. B. Padma Priya
D/o. Sumantha Rao,
Hindu, aged about 55yrs,
R/o. H.No. West Marredpally, Krupa Apartments, Secunderabad.
D6. C. Sathya Gopal
S/o S.Sumanth Rao,
Hundu, aged about 52 years,
R/o. H.No. 42/260/64,
Moulali Hyderabad-40.

The above-named Plaintiff has filed the above suit for partition. The case is now posted for appearance of you on 07/08/2023. You are hereby directed to appear in person or through your pleader on the aforesaid date at 10:30 A.M., failing which you will be set ex-parte.

Sri T.NAGARAJ,
Sri. T.Madhu Sudhan
Advocate, adoni.

IN THE COURT OF THE MVACT CUM II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT : AT HYDERABAD
O.P.No. : 1115 of 2021

Between:
O. Bhaskar ... **Petitioner**
AND
A. Chinna Obula Reddy .. **Respondents**

To,
1. Ch.Nagaraju s/o Pochaiah
R/o.2-93, Shakapur, Pebbair,
Mahabub Nagar district
(Owner Cum Driver)

please take notice that the above petitioner had filed the case for grant of compensation for the injuries sustained by name O. Bhaskar in a motor vehicle accident which occurred on 06-03-2020 under the limits of P.S. Pebbair.

The above case is posted to 17-08-2023 at 10-30 AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either on person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K.ANAND REDDY
D.VENKAT RAMANA
Counsels for the petitioner
Flat No.212, Jamuna Towers,
Opp: Yashoda Hospital,
Malakpet, Hyderabad-36.

కమిటీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా కార్పొరేటీకరణను తరిమికొడదాం

- ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యా కార్పొరేటీకరణను తరిమికొట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి. నాగరాజు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా విస్మరిస్తుందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ కూడా అందలేదని తెలిపారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వ నియంత్రణ ఉండకపోవడం సిగ్గుచేటన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి రవి, గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, అజయ్, నాయకులు అల్తాఫ్, స్టాలిన్, అవినాష్, నితిన్, మణికంఠ, వర్ధిని, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు, జెఎసి నాయకులు

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి డిమాండ్ చేసింది. హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల భవనం ఎదుట జెఎసి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1356 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులనూ పర్మినెంట్ చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి కో- చైర్మెన్ జరుపుల చందూలాల్, నాయకులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శ్రీదేవి, శ్రీలత, డాక్టర్ సురేష్, డాక్టర్ దేవేందర్, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీధర్ రావు, డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ సదానందం, డాక్టర్ దాస్, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి ఏకగ్రీవ అభిప్రాయం

- కోర్టు అనుమతిరాగానే పనులు ప్రారంభం
- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రి నూతన నిర్మాణానికి ప్రజాప్రతినిధుల ఏకగ్రీవ అభిప్రాయం జరిగిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన నిర్మాణ అంశంపై ఆస్పత్రి పరిధిలోని ప్రజా ప్రతినిధులతో మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ప్రజల వైద్య అవసరాల కోసం పాత భవనాలు తొలగించి అయినా నిర్మాణాలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిశీలించి, అఫిడవిట్ రూపంలో హైకోర్టుకు తెలియచేస్తుందని తెలిపారు. హైకోర్టు నుండి అనుమతి రాగానే వెంటనే నూతన భవన నిర్మాణం చేపడతామని వెల్లడించారు. ప్రజల భవిష్యత్ అవసరాలు తీర్చేందుకు సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే నాలుగు టిమ్స్, నిమ్స్ విస్తరణ, సూపర్ స్పెషాలిటీ ఎంసిహెచ్‌ల నిర్మాణం చేపట్టిందని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కెసిఆర్ 2015 లోనే ఉస్మానియా ఆస్పత్రి సందర్శించి, కొత్త భవన నిర్మాణానికి ఆదేశించినట్లు గుర్తు చేశారు. తదనంతరం నిర్మాణం కూల్చవద్దని కొందరు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు స్టే ఇచ్చిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు వేసిన ఐఐటి హైదరాబాద్ నిపుణుల కమిటీ కూడా ఆస్పత్రి అవసరాలకు ఈ భవనం పని చేయదని చెప్పినట్లు వివరించారు. తదుపరి కోర్టు ఆదేశాల ప్రకారం సోమవారం ఆస్పత్రి పరిధిలోని ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. కొత్త భవనం నిర్మాణానికి ప్రజాప్రతినిధులు అందరూ ఏకగ్రీవంగా అంగీకరించడం సంతోషకరం అన్నారు. హైకోర్టు తుది తీర్పు మేరకు కొత్త నిర్మాణం త్వరలో చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపి అసదుద్దీన్ ఒవైసి, ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, వాణీ దేవి, రహమత్ బెగ్, హసన్ ఎఫెండి, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, దానం నాగేందర్, గోపీనాథ్, జాఫర్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, హెల్త్ సెక్రెటరీ రిజ్వి, సిఎం ఒఎస్‌డి గంగాధర్, టిఎస్ఎంఎస్ఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇఎన్‌సి గణపతి రెడ్డి, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిపిఎస్ ఉద్యోగులను

పాత పెన్షన్ పరిధిలోకి తేవాలి

- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) విధానంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పరిధిలోకి వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. దేశంలో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం (సిపిఎస్) అమల్లో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ విధానం అమలయ్యిందని గుర్తు చేశారు. సిపిఎస్ అమలు తేదీ కంటే ముందే నోటిఫికేషన్లు విడుదలై నియామక ప్రక్రియ ఆలస్యమవ్వడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులను బలవంతంగా సిపిఎస్ పరిధిలోకి తెచ్చారని తెలిపారు. ఉపాధ్యాయుల నియామకాలను పరిశీలిస్తే డిఎస్‌సి-2003 నోటిఫికేషన్ ఆ ఏడాది నవంబర్ 13న విడుదలైందని పేర్కొన్నారు. 2004లో పరీక్షలు నిర్వహించి అదే ఏడాది జూన్ 11న ఫలితాలు వెలువడ్డాయని గుర్తు చేశారు. కానీ నియామక ప్రక్రియ ఆలస్యంగా 2005, నవంబర్ 21న పూర్తయ్యిందని వివరించారు. దీంతో వారిని కూడా సీపీఎస్ పరిధిలోకి తెచ్చారని తెలిపారు. అదే విధంగా పోలీస్ శాఖ, గ్రూప్-1, గ్రూప్-2 నియామకాల్లో కూడా 2004, సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందు నోటిఫికేషన్ విడుదలై నియామకాలు తర్వాత జరగడంతో సిపిఎస్ విధానంలో వారు కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదు

ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2004, సెప్టెంబర్ ఒకటికి ముందు నియామక ప్రక్రియ పూరయ్యి ఆ తర్వాత చేరిన వారిని పాత పెన్షన్ పరిధిలోకి తెస్తూ మెమో (నెంబర్ 57/04/2019, తేది 2020, ఫిబ్రవరి 17) ను జారీచేసిందని తమ్మినేని తెలిపారు. ఆ తర్వాత విడుదల చేసిన మెమో (నెంబర్ 57/05/2021 పి అండ్ పిడబ్ల్యు తేది 2023, మార్చి మూడు) ప్రకారం 2003, డిసెంబర్ 22 నాటికి నోటిఫికేషన్ విడుదలై సిపిఎస్ విధానంలో కొనసాగుతున్న వారందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకునేలా ఉత్తర్వులిచ్చిందని గుర్తు చేశారు. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే మార్పులు చేర్పులను రాష్ట్ర ప్రభుత్వాలూ అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో దాదాపు తొమ్మిది వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని పాత పెన్షన్ పరిధిలోకి తేవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపైన తక్షణం ఎలాంటి ఆర్థిక భారం పడబోదని వివరించారు. అందువల్ల ఈ రాష్ట్రంలోనూ సిపిఎస్ పరిధిలోకి బలవంతంగా నెట్టివేయబడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయులను పాత పెన్షన్ పరిధిలోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పోడు పట్టాల పంపిణీ

వారంలో పూర్తిచేయాలి

- వృత్తిదారుల ఆర్థిక సహాయం దరఖాస్తులు పరిశీలించండి
- కలెక్టర్లకు సిఎస్ శాంతికుమారి ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోడు భూముల పట్టా పంపిణీ పురోగతిని సమీక్షించారు. గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల నిల్వలు, తెలంగాణకు హరితహారం, బిసి చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ పథకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై ఆమె కలెక్టర్లను అడిగి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పోడు పట్టాల లబ్ధిదారులకు రైతుబంధు పథకం కింద ఆర్థిక సహాయం అందించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను వారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. పోడు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను రైతు బంధు పోర్టల్‌లో జమ చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, తాజాగా చెట్లను నరికివేయకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎరువులు, విత్తనాల నిల్వలపై కలెక్టర్లు రోజువారీ సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలనీ, దీనికోసం రైతులను ఒప్పించేలా అవగాహనా కార్యక్రమాలు కల్పించాలన్నారు. కలెక్టర్లు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, వాటి పనితీరు సామర్థ్యాన్ని పరిశీలించాలని, మిల్లుల్లోని స్టాక్ పొజిషన్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇంకుడు గుంతలు, హరిత వనాలు, దశాబ్ది సంపద వనాలపై దృష్టి పెట్టాలన్నారు. బిసి చేతివృత్తిదారులకు ఆర్థిక సహాయం కింద అందిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయత్ రాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, రోడ్లు, భవనాల కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఎస్‌సి డెవలప్‌మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పిసిసిఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్, పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SPECIAL COURT IN THE CADRE OF DISTRICT JUDGE FOR TRIAL AND DISPOSAL OF COMMERCIAL DISPUTES CITY CIVIL COURT AT: HYDERABAD
ILA.No.**753** of **2022**
IN
C.O.S.No.**3** of **2020**

BETWEEN:
K.R. Sudharshan Reddy & another
...Petitioners/Petitioners / Plaintiffs
AND
M/S. L. N Constructions & others
Respondents/Respondents/ Defendant Nos. 1 to 4
Sri. Rajender Tarak & others
Respondents/Respondents/ Proposed Defendant Nos.5 to 12

To
Rokkam Shruthi, D/o. Late Rokkam Chandra Shekar, R-13 to 15 are R/o. H.No. 1-43, Aloor Village, Mandal Armoor, District Nizamabad-503224

Please take notice that the Petitioners/ Plaintiffs have filed the above LA.No.753 of 2022 in C.O.S. No.3 of 2020 before the Hon'ble Principal Special Court In the cadre of District Judge for Trial and Disposal of Commercial Disputes City Civil Court, at Hyderabad to implead you as Defendant No. 15 in the above suit. The above I.A stands posted to 19.07.2023 for your appearance. Therefore, you are hereby informed to appear before the Hon'ble Court on that date **19.07.2023** at **10.30** am either in person or through counsel, failing which the matter will be decided in your absence as per law.

BY ORDER OF THE COURT
P. SRI RAM,
Advocate
Plot No. 1188, 3rd Floor, Road No. 45,
Jubilee Hills, Hyderabad-500033

వైఎస్ షర్మిలతో మాట్లాడలేదు

- కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తనతో మాట్లాడినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పిసిసి చేరికల కమిటీ చైర్మన్ కె జానారెడ్డి తెలిపారు. షర్మిలతో తాను మాట్లాడలేదని ఆయన సోమవారం స్పష్టం చేశారు. పార్టీ తనకు ఏదైనా బాధ్యత అప్పగిస్తే.. ఆ పని మాత్రమే చేస్తానని జానారెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కలిసికట్టుగా ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

ప్రగతిభవన్ ముందు కెఎ పాల్ హల్‌చల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి నివాసం ప్రగతిభవన్ ముందు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ హల్‌చల్ సృష్టించారు. సిఎంను కలిసేందుకు ఆయన సోమవారం ప్రగతిభవన్‌కు వచ్చారు. అయితే, అపాయింట్‌మెంట్ లేదని పోలీసులు ఆయన్ని ప్రధానద్వారం వద్దే నిలిపివేశారు.దీంతో పాల్ పోలీసులతో వాదనలకు దిగారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడుతూ,

తెలంగాణ రాష్ట్ర అప్పులు ఎలా తీర్చాలనే అంశంపై సిఎంతో చర్చించేందుకే ప్రగతిభవన్‌కు వచ్చినట్లు చెప్పారు. సిఎంతో భేటీపై తన పార్టీ నేత ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం అందించినప్పటికీ అనుమతి లభించలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిపై సిఎంతో మాట్లాడాలని అనుకున్నట్లు చెప్పారు. అక్టోబర్ రెండున ప్రపంచశాంతి మహాసభలకు సిఎం కెసిఆర్‌ను ఆహ్వానించాలని వచ్చానని కెఎ పాల్ పేర్కొన్నారు.

విత్తు.. వి'పత్తి'

- వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తని గింజలు
- ఏ ఒక్కచోటా నమోదు కాని కనీస వర్షపాతం
- 60 మిమీ వాన కురిస్తేనే పత్తి మొలకలు
- పెట్టుబడులు పెట్టి దిక్కుతోచని స్థితిలో రైతులు
- పులకపోస్తూ.. నీటి తడులిస్తూ.. తంటాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే పంటల్లో వరి తర్వాత స్థానం పత్తిదే. వర్షాధార పంటైన పత్తి బెట్ట పరిస్థితులతో తల్లడిల్లుతోంది. గతేడాది అధిక వర్షాలతో పత్తి దెబ్బతినగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో మొలకలు రాక విలవిలలాడుతోంది. పులకపోసి కొందరు, నీటి తడులిస్తూ మరికొందరు పత్తిని కాపాడుకునేందుకు పడుతున్న తంటాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యే పత్తి ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో సేద్యం చేయవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీనిలో ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలో పత్తి గింజలు నాటారు. కానీ వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో గింజలు నాటిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 60 మి.మీ వర్షం కురిస్తేనే పత్తి గింజలు మొలకెత్తుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్కచోటా గింజలు మొలకెత్తే స్థాయిలో వానలు కురవలేదు.

గతేడాది అతివృష్టి.. ఈ సంవత్సరం అనావృష్టి..

ఖమ్మం జిల్లాలో గతేడాది 2.26 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 60 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గింజలు నాటారు. జూన్‌లో జిల్లా సాధారణ వర్షపాతం 105.2 మి.మీ నమోదు కావాల్సి ఉండగా గతేడాది 121.4 మి.మీ వర్షం కురిసింది. కురవాల్సిన దానికన్నా 15.4 మి.మీ అధికంగానే కురిసింది. పలు ప్రాంతాల్లో 60 మి.మీ మించి వర్షపాతం నమోదవడంతో నేలల్లో నాటిన గింజలు అధిక తేమతో కుళ్లిపోయాయి. ఇక ఈ ఏడాదికి వచ్చేసరికి జూన్‌లో 49.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. అంటే సాధారణ వర్షపాతం కన్నా 52.0 మి.మీ వర్షపాతం తక్కువగా కురిసింది. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే ఉన్నట్టు వాతావరణశాఖ నివేదికలు చెబుతున్నాయి.

ఎకరానికి రూ.7 వేలకు పైగా నష్టం..

పత్తి గింజలు ఇప్పటికే వేసి అవి మొలకెత్తని రైతులు ఎకరానికి రూ.ఏడు వేలకు పైగా నష్టపోతున్నట్టు చెబుతున్నారు. ఎకరానికి దున్నుడు కూళ్లు రూ.ఐదు వేలు, పత్తి గింజల ప్యాకెట్లు ఎకరానికి రెండు చొప్పున రూ.1,700, గింజలు నాటు కూళ్లు ఇద్దరికి రూ.500 ఇలా ఎకరంలో గింజలు మొలకెత్తకుంటే రూ.7వేలకు పైగా నష్టం వాటిల్లుతుంది. నీటి వసతి ఉన్న రైతులు తడులు ఇస్తున్నారు. లేని రైతులు కొందరు పులకబోస్తున్నారు. సరిపడా పదునుకాక నష్టపోతున్నారు. ఇద్దరు మనుషులను పెట్టి నీరు పోయిస్తే రూ.500 ఖర్చు వస్తుంది. కొందరు ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చిపోస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.2,000 వెచ్చిస్తున్నారు. కానీ ఇవన్నీ వృథా ప్రయత్నాలేనని.. నీటి వసతి ఉంటే ఇబ్బంది లేదు కానీ, లేదంటే ఇలాంటి బెట్ట పరిస్థితుల్లో పత్తి గింజలు నాటకపోవడమే ఉత్తమమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

60 మి.మీ వర్షం కురిస్తేనే నాటాలి..
డాక్టర్ జె హేమంత్‌కుమార్, వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్

మరో 15 రోజుల వరకు పత్తి గింజలు నాటుకోవచ్చు. ఆలోగా సరిపడా వర్షం రాకపోతే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడమే మంచిది. ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు కురవగానే తొందరపడి పత్తి గింజలు నాటొద్దు. 60మి.మీ వర్షం ఉంటేనే పత్తి గింజలు మొలకెత్తుతాయి. పులకపోస్తే గింజ మొలకెత్తడానికి సరిపడా పదును ఉండదు. గింజల విషయంలో ఒకటే రకం కాకుండా రెండు, మూడు రకాలు నాటితే ఉత్తమం. వర్షాధారంగా సాగు చేస్తే త్వరగా పూతకొచ్చేవి, నీటి వసతైతే మధ్యస్థంగా, ఆలస్యంగా పూత, కాతకు వచ్చే రకాలను ఎంచుకోవాలి. బీటీ విత్తనాలైతే 3-2 లేదా 4-2 అడుగుల అచ్చులు చేయాలి. తేలిక నేలల్లో అధిక సాంద్రత పత్తిని 10-5 సెం.మీ దూరంలో నాటాలి. పత్తి గింజలు విత్తిన 48 గంటల్లో తేమ ఉన్నప్పుడు పెండిమిథాలిన్ ఎకరానికి 1.2 గ్రాములు పిచికారీ చేయాలి.

ఆగస్టులో అతిపెద్ద ప్లాస్టిక్ ఎక్స్‌పో

- రూ.500 కోట్ల వ్యాపారం నమోదు..!

హైదరాబాద్ : వచ్చే ఆగస్టులో దక్షిణాది, మధ్య భారతదేశంలోనే అతిపెద్ద ప్లాస్టిక్ ఎక్స్‌పోను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. హైటెక్స్‌లో ఆగస్టు 4-7 తేదీల్లో హిప్లెక్స్-2023 ప్రదర్శన జరగనుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (టిఎపిపిఎంఎ) ప్రెసిడెంట్ విమలేష్ గుప్తా, హిప్లెక్స్ చైర్మన్ బిఎల్ భండారి, పాస్ట్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి వెన్నమ్ వెల్లడించారు. ఎఫ్‌టిసిసిఐలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు సాగనున్న ఈ ఎక్స్‌పోలో రూ.500 కోట్ల విలువ చేసే వ్యాపారం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దాదాపుగా 500 మంది ఎగ్జిబిటర్లు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచనున్నారని తెలిపారు. 50 వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేశారు. ఈ ప్రదర్శనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతును అందిస్తున్నాయన్నారు ప్రపంచ తలసరి సగటు ప్లాస్టిక్ వినియోగం 65 కిలోలుగా ఉందన్నారు. భారత్‌లో ఇది 32-35 కిలోలుగానే ఉందని.. అమెరికాలో 70-75 కిలోల వినియోగం జరుగుతుందన్నారు. ప్రపంచ సగటుతో పోల్చితే భారత్‌లో వినిమయం తక్కువగా ఉందన్నారు. ఈ రంగంలో విస్తృతావకాశాలు ఉన్నాయని తెలిపారు. గడిచిన పదేళ్లలో ప్లాస్టిక్ వినియోగంలో రెండంకెల వృద్ధి చోటు చేసుకుందన్నారు.

రాహుల్‌ను పప్పు అనడంలో తప్పు లేదు

- మంత్రులు వేముల, పువ్వాడ విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని గతంలో పప్పు అని ఎవరైనా సంబోధిస్తే కొంచెం బాధ అనిపించేదని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కానీ ఖమ్మం సభ తర్వాత ఆయన్ను పప్పు అనటంలో ఎలాంటి తప్పూ లేదనే భావనకు తామొచ్చామని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి పువ్వాడ అజయకుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, సురేందర్, సండ్ర వెంకటవీరయ్య తదితరులతో కలిసి వేముల మాట్లాడారు. రాహుల్ గాంధీ.. ఒక రిమోట్ గాంధీలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన ఖమ్మం సభ వచ్చామా.. మాట్లాడామా.. పోయామా... అన్నట్టుగా సాగిందని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రాసిచ్చిన స్క్రిప్టును మాత్రమే చదివి వెళ్లిపోయిన ఆయనకు ఏమాత్రం విషయ పరిజ్ఞానం లేదని అన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా వేముల వ్యాఖ్యానించారు. ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారో అందరికీ తెలుసునని విమర్శించారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించండి

- మంత్రి ఎర్రబెల్లికి డిబిఎఫ్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి హామీ పరిరక్షణకు కూలీల నుంచి చేపట్టిన లక్ష సంతకాల సేకరణ పత్రాలను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా డిపిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, టివివియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.వెంకటయ్య మాట్లాడుతూ.. పని దినాలను వంద రోజుల నుంచి 200 రోజులకు, కనీస వేతనాలను రూ.800లకు పెంచాలని కోరారు. వేతనాల అలస్యాన్ని నివారించాలనీ, బడ్జెట్ పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి కమిషనర్‌కు సైతం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగన్న, ప్రభుదాస్ ,జమలయ్య, వెంకటమ్మ, స్వాతి, శ్రీనివాస్, మునెష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఇపి, సిపిఎస్‌ను రద్దు చేయాలి

- విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై నిరసన
- 11,12,13 తేదీల్లో మండలాల్లో పాదయాత్రలు
- కెజిబివి, యుఆర్ఎస్ సమస్యలపై 20న చలో ఎస్‌పిడి కార్యాలయం
- గురుకుల టీచర్ల సమస్యలపై ఆగస్టు ఐదున హైదరాబాద్‌లో మహాధర్నా
- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను పెంచి పోషించేలా ఉన్న జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి-2020)ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలతో కూడిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని కోరింది. ఉద్యోగుల కుటుంబాల సామాజిక భద్రతకు ముప్పుగా పరిణమించిన జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్- సిపిఎస్) ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని తెలిపింది. టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని వర్చువల్ పద్ధతిలో సోమవారం నిర్వహించారు. అనంతరం టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పొదుపు మొత్తాలపై ఇచ్చే పన్ను రాయితీని రూ.మూడు లక్షలకు పెంచాలని కోరారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో ఈనెల 11,12,13 తేదీల్లో మండలాల్లో పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. వచ్చేనెల 12న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపడతామని పేర్కొన్నారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, డిఇఒ, డిప్యూటి ఇఒ, ఎంఇఒ తదితర పర్యవేక్షణాధికారుల పోస్టులను మంజూరు చేసి రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలని కోరారు. బడుల్లో మౌలిక వసతులు కల్పించాలని, నెల మొదటి తేదీన వేతనాలివ్వాలని, ట్రెజరీల్లో పాసై ప్రభుత్వం వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. బకాయి ఉన్న రెండు డిఎ వాయిదాలను విడుదల చేయాలని, రెండో పీఆర్సీ కమిటీని నియమించి ఈ ఏడాది జులై ఒకటి నుంచి ఆర్థిక ప్రయోజనంతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని యాజమాన్యాల విద్యాసంస్థల్లోని ఉద్యోగులకు ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని కోరారు.

శ్రమకు తగిన వేతనాలివ్వాలని పేర్కొన్నారు. గురుకుల విద్యా సంస్థలు, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీవీ, యూఆర్ఎస్, సింగరేణి తదితర విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయా యాజమాన్యాల వారీగా దశలవారీ ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు, వచ్చేనెల ఐదో తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యలపై ఈ నెల 20న చలో ఎస్‌పిడి కార్యాలయం కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఈ పోరాట కార్యక్రమాలన్నింటిలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు.

డిమాండ్లు :

1. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని రద్దు చేయాలి.
2. జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్-సీపీఎస్)ని రద్దు చేసి పాత పెన్షన్ విధానా(ఓపీఎస్)ని పునరుద్ధరించాలి.
3. ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచాలి. పొదుపు మొత్తాలపై ఇచ్చే రాయితీని రూ.మూడు లక్షలకు పెంచాలి.
4. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
5. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
6. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ తదితర తాత్కాలిక ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనమివ్వాలి.
7. రాష్ట్రంలో విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ టాప్

- రాష్ట్రానికి అత్యధిక ఎఫ్‌డిఐలు
- పట్టణ, గ్రామీణాభివృద్ధికి సమాన ప్రాధాన్యత
- హ్యాట్రిక్ గెలుపునకు మద్దతివ్వండి
- ఎఫ్‌టిసిసిఐ అవార్డుల ప్రదానంలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి కెటి రామారావు అన్నారు. రాష్ట్రావతరణ అనంతరం గడిచిన తొమ్మిదేళ్లలో తమ ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసిందన్నారు. ఇంతక్రితం సిఎంలు ఒక్కరు పట్టణ ప్రాంతం, పరిశ్రమలపై, మరొక్కరు గ్రామీణ ప్రాంతాలపై వేరువేరుగా దృష్టి సారించారన్నారు. కానీ.. తమ ప్రభుత్వం రైతులు, సంక్షేమం, వ్యవసాయం, పరిశ్రమలు, పట్టణాల అభివృద్ధిపై సమాన దృష్టి పెట్టిందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఎఫ్‌టిసిసిఐ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం జరిగింది. 22 కేటగిరిల్లో అవార్డులను అందించారు. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి కెటిఆర్ హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడోసారి తమ ప్రభుత్వ గెలుపుతో హ్యాట్రిక్‌ను అందించడానికి మద్దతును ఇవ్వాలని ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు. భారత మొత్తం ఔషద ఉత్పత్తుల తయారీలో తెలంగాణ 40 శాతం వాటా కలిగి ఉందన్నారు. వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచంలోనే మూడింట ఒక్క వంతు ఇక్కడే తయారు అవుతున్నాయని... రాబోయే ఏడాదిలో ప్రపంచానికి అవసరమయ్యే సగం వ్యాక్సిన్లను ఇక్కడి నుంచే అందించే అవకాశం ఉందన్నారు. ఇక్కడి 214 యూనిట్లకు యుఎస్ఎఫ్‌డిఎ అనుమతులు ఉన్నాయన్నారు. సుల్తాన్‌పూరలో అతిపెద్ద మెడికల్ డివైస్ పార్క్‌ను ఏర్పాటు చేశామని.. ఇక్కడ ప్రస్తుతం 60 పైగా యూనిట్లు ఉన్నాయన్నారు. దిగుమతులపై భారత్ పెద్ద మొత్తంలో ఆధారపడుతుందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్రానంతరం కూడా మనం ఇప్పటికీ 75 శాతం ఔషద ముడి సరుకులను, 80 శాతం వంట నూనెలను దిగుమతి చేసుకోవడం బాధకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం మిగితా భారతదేశానికి కూడా మార్గం చూపించాలని కోరుకుంటుందన్నారు. హైదరాబాద్ నుంచి అజాద్ ఇంజనీరింగ్, స్కైరూట్ లాంటి సంస్థలు గ్లోబల్ కంపెనీలుగా ఎదుగడం ప్రశంసనీయమన్నారు. విద్యుత్ బిల్లుల వన్‌టైం సెటిల్‌మెంట్ గురించి ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ అనిల్ అగర్వాల్ చేసిన అభ్యర్థనపై మంత్రి స్పందించి.. అవసరమైన వాటిని చేస్తానని చెప్పారు. ఎఫ్‌టిసిసిఐ భూమి, ఇతర అభ్యర్థనల గురించి ముఖ్యమంత్రితో సంప్రదించిన తర్వాత సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ అవార్డుల ప్రదానంలో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ అనిల్ అగర్వాల్, ఎక్సలెన్స్ అవార్డ్స్ కమిటీ చైర్మన్ అరుణ్ లుహరుక, ఎఫ్‌టిసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మీలా జయదేవ్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

- మావల్లే వ్యవసాయ చట్టాలు ఆగిపోయాయి
- తమిళనాడు గవర్నర్‌ను తొలగించాలి
- మీడియాతో బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కెకె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను తమ పార్టీ సమర్థించిందంటూ ఖమ్మం సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడటం హాస్యాస్పదమని బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె కేశవరావు ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎంపిలు నామా నాగేశ్వరరావు, బిబి పాటిల్, మన్నె శ్రీనివాసరెడ్డి, రాములు, కొత్త ప్రభాకరరెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో కలిసి కెకె మాట్లాడారు. పార్లమెంటులో వ్యవసాయ నల్ల చట్టాలను తమ పార్టీ వ్యతిరేకించిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆ సమయంలో కేంద్రం తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ ఎంపిలు పార్లమెంటు సమావేశాలను బహిష్కరించారని గుర్తు చేశారు. ఒకరకంగా చెప్పాలంటే బిఆర్ఎస్ కారణంగానే ఆయా నల్ల చట్టాలను మోడీ సర్కార్ ఉపసంహరించుకుందని వివరించారు. కానీ వాటిని తాము సమర్థించినట్టు ఓ జాతీయ నేత (రాహుల్ గాంధీ) చెప్పడం సరికాదన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. రాహుల్ తన ప్రసంగం ఆసాంతం అబద్ధాలనే వల్లే వేశారని విమర్శించారు. తమ పార్టీ మాదిరిగా జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా మరే పార్టీ పోరాడటం లేదని చెప్పారు. ఆ రకంగా బిజెపికి వ్యతిరేకంగా కలుస్తున్న పార్టీల్లో బీఆర్ఎస్ ముందుంటుందని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో విపక్షాల సమావేశానికి సంబంధించి బిఆర్ఎస్ వస్తే... తాము హాజరు కాలేమంటూ రాహుల్ చెప్పారని వివరించారు. ఈ మాటను ఆయన గతంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. బిజెపి వ్యతిరేక కూటమికి నాయకత్వం వహించే లక్షణాలు రాహుల్‌కు లేవని ఎద్దేవా చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించి, దాన్ని అవమానించిన తమిళనాడు గవర్నర్‌ను తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని కెకె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నామా మాట్లాడుతూ... బిజెపికి దగ్గరగా వ్యవహరించేది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. పార్లమెంటులో ప్రధానిని కౌగిలించుకున్నది ఎవరంటూ పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బిజెపి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఏనాడూ పోరాడలేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో ఒకరకంగా, తెలంగాణలో మరో రకంగా మాట్లాడటం రాహుల్‌కే చెల్లిందని విమర్శించారు. దేశంలో వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించేది కేవలం కెసిఆర్ మాత్రమేనని అన్నారు.

హైదరాబాద్‌లో మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

అమెరికాకు చెందిన మైక్రోచిప్ టెక్నాలజీ కంపెనీ హైదరాబాద్‌లో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సోమవారం మంత్రి కెటిఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రంలో చాండ్లర్‌లో మైక్రోచిప్ టెక్నాలజీ కంపెనీ ప్రధాన కార్యాలయం ఉందని ఆ కంపెనీ ప్రెసిడెంట్, సిఇఒ గణేష్ మూర్తి అన్నారు. గణేష్ మూర్తి మీడియాతో మాట్లాడుతూ.. "భారతదేశంలో దాదాపు 25 సంవత్సరాలు విజయవంతంగా కార్యకలాపాలను నిర్వహించిన అనుభవంతో ఈ కొత్త సదుపాయం రాబోయే సంవత్సరాల్లో మైక్రోచిప్ వృద్ధి ప్రణాళికలను అమలు చేయడానికి మాకు తోడ్పడుతుంది. ఈ సెంటర్ భారతదేశంలోని కీలక వ్యాపార కారిడార్‌లలో ఉండటంతో, గ్లోబల్ మైక్రోచిప్ వ్యాపార అవసరాలకు ఈ ప్రాంతంలో పెరుగుతున్న మా కస్టమర్ బేస్‌కు మద్దతుగా హెడ్‌కౌంట్‌ను గణనీయంగా విస్తరించడానికి మాకు దోహద పడుతుంది." అని అన్నారు.

నేడు కియా నూతన సెల్టోస్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : కియా ఇండియా జులై 4న తన సరికొత్త సెల్టోస్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. నూతన సెల్టోస్ తాజా డిజైన్, మెరుగైన ఫీచర్స్‌ను కలిగి ఉంటుందని పేర్కొంది. ఇది నూతన విప్లవాన్ని సృష్టించనుందని వెల్లడించింది. 2019 ఆగస్టులో కియా సెల్టోస్ ఆవిష్కరణతో భారతదేశపు మార్కెట్‌లోకి అడుగు పెట్టింది. ఇప్పటి వరకు 3.78 లక్షల యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది



ధరణి అక్రమాలపై సహించేది లేదు

- మాజీ ఎంపి వి హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్యాయం ఎక్కడ జరిగితే తాను అక్కడే ఉంటానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి వి హనుమంతరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరణి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల భూములను పెద్దలకు కట్టబెట్టారని ఆరోపించారు. ఆనాడు ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ దున్నే వాడిదే భూమి అని వందల ఎకరాల భూమిని పేదలకు పంచి పెడితే ప్రస్తుతం బిఆర్ఎస్ ఆ భూములు లాక్కుంటుందని విమర్శించారు. కీసర ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో అక్రమ వెంచర్లకు అనుమతులు ఇస్తూ.. పేదల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ పంచి పెట్టిన భూములను కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వాటిని తిరిగి ఇస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు హుస్సేన్, జెడ్‌పిటిసి బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు.. మూడు ప్రాంతాలు...

- ప్రచార పర్వంలో తనతోపాటు కెటిఆర్, హరీశ్‌కు ప్రాధాన్యత
- ఎన్నికల ప్రచారంపై సిఎం కెసిఆర్ యోచన
- కాంగ్రెస్, బిజెపి జాతీయ నేతల రాకతో సరికొత్త వ్యూహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇప్పటిదాకా కలెక్టరేట్ల ప్రారంభోత్సవాలు.. ఎస్‌పి ఆఫీసులు, బిఆర్ఎస్ జిల్లా కార్యాలయాల ఓపెనింగుల పేరిట రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యటించి వచ్చిన సిఎం కెసిఆర్.. ఇప్పటి నుంచి 'రూటు' మార్చనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ స్పీడు పెరగడం, బిజెపి జాతీయ నాయకులను తీసుకొచ్చి హడావుడి చేస్తుండడం తదితర కారణాల రీత్యా ఆయన కూడా సరికొత్త ఎన్నికల వ్యూహాన్ని రచించారు. ఇప్పటి నుంచే దాన్ని అమలు చేయబోతున్నారు. మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావులకు తనతోపాటు సమాన ప్రాధాన్యత కల్పించడం ద్వారా ఎన్నికల ప్రచారంలో ఆయన వారిని వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఉత్తర, దక్షిణ తెలంగాణాలతోపాటు హైదరాబాద్ నగరాన్ని ప్రత్యేకంగా విభజించుకుని... ఆయా ప్రాంతాల్లో వారు పర్యటించనున్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేక ప్లాన్‌ను కెసిఆర్ రూపొందించినట్టు తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. ఆ షెడ్యూల్ ప్రకారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కెసిఆర్ పర్యటన ఉంటే... మిగతా రెండు ప్రాంతాల్లో కెటిఆర్, హరీశ్ విడివిడిగా పర్యటిస్తారు. మరో సందర్భంలో సిఎం దక్షిణ తెలంగాణ పర్యటనకు వెళితే... మంత్రులిద్దరూ మిగతా ఏరియాల్లో ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తారు. తద్వారా ఒకే రోజు ముగ్గురు నేతలూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ద్వారా అటు కాంగ్రెస్, బిజెపి మీద ఎదురుదాడి చేయొచ్చన్నది కేసీఆర్ వ్యూహం.

జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో ఇప్పటికే పలు సభలతో హడావుడి చేస్తోంది. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన రాహుల్ గాంధీ సభతో రాజకీయాలు మరింత హీటెక్కాయి. హస్తం పార్టీ నిర్వహించిన ఈ సభ ద్వారా అది ఎలక్షన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టినట్టే. అందువల్లే రాహుల్... ప్రజలపై వాగ్దానాల వర్షం కురిపించారు. ఈ క్రమంలో ఇప్పటి నుంచే రాహుల్‌తోపాటు సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తదితరులు రాష్ట్రంలో పర్యటించనున్నారు. కర్నాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌నూ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. బిజెపి సైతం ఢిల్లీ పెద్దలను రంగంలోకి దించనుంది. ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు రాష్ట్రంలో పర్యటించి వెళ్లారు. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రధాని మోడీతోపాటు బిజెపి రాష్ట్రాల సిఎంలు వరసగా తెలంగాణలో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు.

ఈ పరిణామాలన్నింటి రీత్యా... కాంగ్రెస్, బిజెపిలతో ఢీ అంటే ఢీ అనే విధంగా గులాబీ దళపతి తన వ్యూహాన్ని, కార్యాచరణను సిద్ధం చేసుకున్నట్టు బిఆర్ఎస్‌లోని సీనియర్లు చెబుతున్నారు. అందుకే ఆ రెండు పార్టీలపై మూకుమ్మడిగా విమనాస్త్రాలు సంధించటం ద్వారా వాటిని గుక్క తిప్పుకోకుండా చేయాలంటూ ఆయన కెటిఆర్, హరీశ్‌కు దిశా నిర్దేశం చేశారు. పెన్షన్లు, రైతులకు సహాయాలు, ఉద్యోగుల జీత భత్యాలు, మహిళా సంక్షేమం తదితర అంశాలను కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాలతో పోల్చి చూపడం ద్వారా బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రత్యేతకను చాటి చెప్పాలంటూ సిఎం ఆదేశించారు. అప్పుడే ఆ రెండు జాతీయ పార్టీలను ధీటుగా ఎదుర్కోగలమని, ప్రచారాన్ని వేడెక్కించగలమని ఆయన భావిస్తున్నట్టు బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.